




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :235 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి గురువారం 3 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :235 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI THU 3 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి చేరిన గోదావరి జలాలు
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చామని చెప్పిన సీఎం చంద్రబాబు
- భవిష్యత్తులో సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తామని ప్రకటన
- గత ప్రభుత్వం విధ్వంసం చేస్తే, తాము అభివృద్ధి చేస్తున్నామని విమర్శ
- ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి



# అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది..
# ఇది ఖాయం.. రాసిపెట్టుకోండి



ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు.

## మాట నిలబెట్టుకున్నాం.. పునర్నిర్మాణం చేస్తున్నాం

గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు.

- మిగతా 2లో



రాష్ట్రంలో సాగునీటి పండుగ..

## చంద్రబాబు అపర భగీరథుడు

- రాష్ట్రంలో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందన్న పట్టాభి
- గోదావరి-కృష్ణా అనుసంధానాలతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని వ్యాఖ్య
- వైసీపీ నేతలు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని

- మిగతా 2లో

## ఈ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరింది

### పాయకరావుపేటలో అనిత



- పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు చేరిన గోదావరి జలాలు
- సీఎం చంద్రబాబు సంకల్పం వల్లే ఐదు దశాబ్దాల కల నెరవేరిందన్న హోంమంత్రి అనిత
- గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును దెబ్బతీసిందని విమర్శ
- చంద్రబాబు అపర భగీరథుడని, ఒక్క ఓటుతోనే గోదారిని తెచ్చుకున్నామని వ్యాఖ్య
- పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేసే రోజు ఎంతో దూరంలో లేదని ధీమా

- మిగతా 2లో



## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.

### టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం ఇంట ఏసీబీ సోదాలు

- తిరుపతి, తిరుమలలోని ఇల్లు, ఆఫీసులో ఏకకాలంలో దాడులు
- బంధువుల ఇళ్లు, గెస్ట్ హౌస్‌పైనా ఏసీబీ అధికారుల తనిఖీలు
- ఏడు ప్రత్యేక బృందాలతో కొనసాగుతున్న సోదాలు

- మిగతా 2లో

## నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం
- గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

- మిగతా 2లో



# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్



- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశం లో

- మిగతా 2లో

# 'అది విధ్వంసక చర్యే'..

## పాక్‌లో ఆలయం కూల్చివేతను ఖండించిన భారత్



**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఇటీవల దాదాపు వందేళ్ల పురాతన ఆలయం కూల్చివేతను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనను విధ్వంసకర చర్యగా పేర్కొంది. ఈ వ్యవహారంలో అధికారుల ఉదాసీనత, శతాబ్దం క్రితం నాటి ఆలయాన్ని పరిరక్షించడంలో వారి వైఫల్యం ఆందోళనకరమని తెలిపింది.

- మిగతా 2లో



## నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు.. మళ్లీ వరద ముప్పు!

- నేపాల్‌లో భారీ వర్షాలతో పలు నదులకు పోటెత్తిన వరదలు
- మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టం హెచ్చరిక స్థాయిని దాటిన వైనం
- మర్స్యంగ్డి నదిలో ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్న వరద
- నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటమే వరదలకు కారణం

పెన్ పవర్ డెస్క్:హిమాలయ దేశం నేపాల్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకర స్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో, అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలందరూ

- మిగతా 2లో

# ఇది భిక్ష కాదు



## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

పెన్ పవర్ డెస్క్:నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్

- మిగతా 2లో

- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య



## అన్నయ్యా.. మీరే నా మొదటి హీరో

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు బర్త్‌డే శుభాకాంక్షలు చెప్పిన వారందరికీ పవన్ కృతజ్ఞతలు చెప్పారు. తన సోదరుడు,

- మిగతా 2లో

## నాన్నే నా స్ఫూర్తి

### వైయస్ఆర్‌ను తలచుకుంటూ.. వైయస్ జగన్ భావోద్వేగ సందేశం

**పెన్ పవర్ డెస్క్:** మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## రాష్ట్రంలో సాగునీటి పండుగ.. చంద్రబాబు అపర భగీరథుడు

- మొదటి పేజి తరువాయి

ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు.దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్‌ల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు. టీబీ డ్యామ్ గేట్లను యుద్ధప్రాతిపదికన మార్చి నీటి నిల్వపై భరోసా కల్పించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన పట్టాభి... వారు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట వేల కోట్లు దోచుకుని, పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి, పనులు 17 నెలలు నిలిచిపోవడానికి జగనే కారణమని ఆరోపించారు. జగన్ హయాంలో 'జలయజ్ఞం' కాస్త 'ధనయజ్ఞం'గా మారిందని... అనుమతులు లేని రాయలసీమ లిఫ్ట్ పేరుతో మట్టి పనుల కింద వైసీపీ నేత పెద్దిరెడ్డికి రూ.1,000 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు కడుపుమంటతో అల్లాడిపోతున్నారని అన్నారు.

## ఇది భిక్ష కాదు

- మొదటి పేజి తరువాయి

విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు.భోటేకోషి నదిలో సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు... రానున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు సమాచారం. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, పునర్నిర్మాణానికి ప్రాథమికంగా 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

## నాన్నే నా స్ఫూర్తి

- మొదటి పేజి తరువాయి

తన తండ్రిని స్మరించుకుంటూ భావోద్వేగ సందేశాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "మిస్ యూ ఆల్వేస్, డాడ్! యూ విల్ ఫరెవర్ బీ మై ఇన్స్పిరేషన్" అంటూ తండ్రిపై తనకున్న అప్యాయతను వ్యక్తం చేశారు.

వైయస్ఆర్ తనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని వైయస్ జగన్ పేర్కొన్నారు. తండ్రితో తనకున్న అనుబంధాన్ని, ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అంతకుముందు ఇడుపులపాయలోని వైయస్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, పార్టీ కేడర్‌తో కలిసి మహానేతకు నివాళులర్పించారు.

## అన్నయ్యా.. మీరే నా మొదటి హీరో

- మొదటి పేజి తరువాయి

అగ్ర కథానాయకుడు చిరంజీవి విష్ చేస్తూ పెట్టిన పోస్టుకు ఉద్వేగభరితంగా స్పందించిన పవన్.. తన ఎదుగుదలకు ఆయన ఇచ్చిన ప్రోత్సాహాన్ని గుర్తు చేసుకుంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు."మీ ప్రేమ, ఆప్యాయత, శుభాకాంక్షలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. చిన్ననాటి నుంచి నాపై మీరు చూపిన నమ్మకం, ఇచ్చిన అండ నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైనవి. తండ్రి స్థానంలో నిలిచి నాకు దిశ చూపిన మీరు నా జీవితంలో మొదటి హీరో. జీవితంలో ఏం సాధించాలో తెలియని రోజుల నుంచి నన్ను నడిపించిన మీ మాటలు, మీ ఆలోచనలు నాతోనే ఉన్నాయి.కుటుంబం పట్ల మీ ప్రేమను, సమాజం పట్ల మీ బాధ్యతను, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలనే మీ తపనను చూస్తూ పెరిగాను. ఆ అనుభవాలే నా ఆలోచనలకు ఒక దిశను ఇచ్చాయి. మీరు నా జీవితానికి ఎప్పటికీ మార్గదర్శి. మన ఇలవేల్పు శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతో, మీ ఆశీస్సులతో ముందుకు సాగుతాను" అని పవన్ పేర్కొన్నారు.

## నాదెండ్ల పవన్ ను తప్పుదోవ పట్టిస్తున్నారా? ఎవరి మనసులో ఏముంది?

జనసేన పార్టీలో కీలక నేత నాదెండ్ల మనోహర్ పై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. నాదెండ్ల తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు రాజకీయంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న భావన క్యాడర్ లో నెలకొంది. అంతా తానే అయి.. అధినేతను ఎవరినీ కలవనివ్వకుండా, వాస్తవ విషయాలను చెప్పనివ్వకుండా దాచి ఉంచుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. నాదెండ్ల మనోహర్ పై ఇటువంటి ఆరోపణలు కొత్తేమీ కాదు. జనసేన పార్టీ పెట్టిన నాటి నుంచి పవన్ కల్యాణ్ వెన్నంటే ఉన్న నాదెండ్లను పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్త పరుస్తున్నారు. అంతే తప్పించి సభల్లోనూ, సమావేశాల్లోనూ పవన్ కల్యాణ్ కు చెప్పేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. అయితే నాదెండ్ల కేవలం పవన్ చేసిన సూచనల మేరకే అమలు చేస్తున్నారని, ఇందులో ఆయన తప్పేముందని కూడా కొందరు నాదెండ్ల మనోహర్ ను సమర్థిస్తున్నారు.

### పార్టీలో కీలకంగా మారడంతో...

ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురి కావడం, చంద్రబాబుతో భేటీలోనూ, పార్టీ నేతల సమావేశంలోనూ నాదెండ్ల మనోహర్ కీలకం గా వ్యవహరిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆయనను నమ్మి కీలక పాత్రను అప్పగించారని చెబుతున్నారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పై పార్టీ క్యాడర్ మరియు నేతల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రచారం సోషల్ మీడియా మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో సాగుతుంది. .ప్రస్తుతం జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, నాయకత్వం మరియు క్యాడర్ మధ్య సమన్వయం కోసం ఆయన విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలిచే స్థానాల్లోనే పోటీ చేయాలని, బలం లేని చోట పోటీకి దిగవద్దని నాదెండ్ల మనోహర్ మనోహర్ వ్యాఖ్యానించడం దిగువ శ్రేణి నేతల్లో ఆగ్రహానికి కారణమయింది.

# అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది.. ఇది ఖాయం.. రాసిపెట్టుకోండి

- మొదటి పేజి తరువాయి

హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు.

### ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే జల ప్రణాళిక

ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

"గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

### గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గడ్డలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు.

విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దార్శనికత

"సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు.

"ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజలకు పిలుపు.. భవిష్యత్తుకు భరోసా

గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "పాలకులం కాదు, మీకు సేవకులం. పదవి అంటే పెత్తనం కాదు, జవాబుదారితనం. మాకు అహంకారం లేదు, అంకితభావం ఉంది" అని అన్నారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"

- మొదటి పేజి తరువాయి

కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.

రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## 'అది విధ్వంసక చర్యే'.. పాక్‌లో ఆలయం కూల్చివేతను ఖండించిన భారత్

- మొదటి పేజి తరువాయి

"పాకిస్థాన్‌లో వందేళ్ల క్రితం నాటి ఆలయంపై జరిగిన విధ్వంసకాండను ఖండిస్తున్నాం. ఇలాంటి ఘటనలు ఆ దేశంలో మైనారిటీల దుస్థితిని, అలాగే వారి మత స్వేచ్ఛ, ప్రార్థనా మందిరాల విషయంలో జరుగుతున్న ఉల్లంఘనలను స్పష్టం చేస్తున్నాయి. సంబంధిత ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం తక్షణమే పారదర్శకంగా విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా.. ఆ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు చొరవ చూపాలి. మైనారిటీల భద్రత, వారి సాంస్కృతిక వారసత్వానికి భరోసా కల్పించాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆమె గౌను ఫ్యాషన్ కాదు.. 'ప్రసవ వేదన' కథ

నరోవల్‌లోని సిరాజ్ గ్రామంలో ఉన్న ఆ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని పక్కనే ఉన్న మదర్సాలో కలిపేందుకు మత ఛాందసవాదులు కూల్చివేతకు పాల్పడ్డారని స్థానిక ప్రజలు, మైనారిటీ సంస్థలు, రాజకీయ నేతలు పేర్కొన్నారు. అయితే, ఈ పాత ఆలయం భారీ వర్షాల కారణంగా ధ్వంసమయ్యిందని ప్రభుత్వం చెబుతోంది.

## నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు.. మళ్లీ వరద ముప్పు!

- మొదటి పేజి తరువాయి

అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల నాటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు, లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యాంగ్ది నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుందెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది.

ఈ పరిణామాల నేపథ్యంలో, నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) ప్రజలకు కీలక సూచనలు చేసింది. ముఖ్యంగా మర్స్యాంగ్ది నది దిగువ ప్రాంతాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని కోరింది. నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాజధాని ఖాట్మండు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలు అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

## నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యా ర్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు. టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం ఇంట ఏసీబీ సోదాలు

టీటీడీలో అవినీతి ఆరోపణలు కలకలం రేపాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈవో) ఎం. లోకనాథం నివాసం, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఈరోజు దాడులు నిర్వహించారు. తిరుపతి, తిరుమలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి.ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఏడు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. ఈరోజు ఉదయం 6 గంటలకే అధికారులు తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఉన్న లోకనాథం నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇంట్లోనే ఉండగా తనిఖీలు ప్రారంభించారు. అదే సమయంలో తిరుమలలోని ఆయన కార్యాలయంలో మరో బృందం సోదాలు చేపట్టింది. ఈ దాడులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా జరుగుతున్నాయని ఏసీబీ వర్గాలు తెలిపాయి.ఈ సోదాలను అధికారులు బహుళ ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. తిరుపతిలో లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లలో, యెర్పేడు మండలం చెల్లూరులో ఉన్న ఆయన సోదరి నివాసంలోనూ తనిఖీలు చేపట్టారు. తిరుమలలో లోకనాథంకు సంబంధం ఉందని భావిస్తున్న ఒక గెస్ట్ హౌస్‌లో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. విచారణలో భాగంగా తిరుపతి ఎస్టీవీ నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలో ఉన్న లోకనాథం బ్యాంక్ లాకర్లను కూడా అధికారులు తెరిచి పరిశీలిస్తున్నారు. లోకనాథం ప్రస్తుతం శ్రీవారి ఆలయం టెంపుల్ డిప్యూటీ ఈవోగా కీలక బాధ్యతల్లో ఉండగా, గతంలో టీటీడీలో వివిధ హోదాల్లో పనిచేశారు.గత దశాబ్ద కాలంలో ఒక టీటీడీ ఉన్నతాధికారిపై ఏసీబీ సోదాలు నిర్వహించడం ఇది రెండోసారి. 2016లో అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. భూపతి రెడ్డి నివాసంపైనా ఇదే తరహా ఆరోపణలతో ఏసీబీ దాడులు చేసింది. అప్పట్లో ఆయనకు సంబంధించిన 12 ఇంటి స్థలాలు, ఒక అపార్ట్‌మెంట్, నాలుగు అంతస్తుల భవనం పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లోకనాథం ఆస్తులపై సోదాలు కొనసాగుతుండగా, పూర్తి వివరాలు తనిఖీల తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఈ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరింది

ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతానికి చేరాయి. ఈ చారిత్రక ఘట్టంపై రాష్ట్ర హోం శాఖ మంత్రి, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పం, అవిశ్రాంత కృషి వల్లే సాధ్యమైందని కొనియాడారు. "నీరు ఉన్నచోటే జీవం, ప్రగతి, అభివృద్ధి ఉంటాయి. ఐదు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న కలను నిజం చేసిన మహనీయుడు చంద్రబాబు" అని ఆమె ప్రశంసించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అనిత మాట్లాడుతూ.. "పోలవరం కేవలం ఒక ప్రాజెక్టు కాదు, అదొక జీవనాడి, ఒక ఎమోషన్. మన చిన్నతనం నుంచి వింటున్న పోలవరం ఈరోజు కళ్లముందు సాకారం కావడం చంద్రబాబు దయవల్లే సాధ్యమైంది. ఆలోచనలు ఎవరికైనా వస్తాయి, కానీ వాటిని కార్యరూపంలో పెట్టే దృఢ సంకల్పం, పట్టుదల, దైవానుగ్రహం అన్నీ కలిస్తే ఆరు అడుగుల రూపంలో మన ముందున్న చంద్రబాబు గారు" అని అన్నారు. ఈ బృహత్కార్యంలో చంద్రబాబుకు రాముడి వెంట హనుమంతుడిలా సహకరిస్తున్నారంటూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత ఐదేళ్ల పాలనపై అనిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2014-19 మధ్య చంద్రబాబు పోలవరం పనులను 72% పూర్తి చేస్తే, ఆ తర్వాత వచ్చిన గొడ్డలిపాటి నేతలు రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును నాశనం చేశారు. ఐదేళ్లలో కనీసం 2% పనులు కూడా చేయకుండా ఆటంకాలు సృష్టించారు. ప్రాజెక్టు ఐదేళ్లు ఆలస్యం కావడం అంటే ఒక రైతు జీవితంలో ఐదేళ్ల నిరీక్షణ, ఒక ప్రాంత అభివృద్ధిలో ఐదేళ్ల వెనకడుగు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి అసెంబ్లీలో "పోలవరం ఎవరి చేతిలో ప్రారంభం కావాలో రాసిపెట్టి ఉందో, ఆయనే పూర్తి చేస్తారు" అని చెప్పిన మాటలను ఆమె గుర్తుచేశారు. ఆ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరిందని పేర్కొన్నారు.చంద్రబాబును 'అపర భగీరథుడు'గా అభివర్ణించిన అనిత, "పురాణాల్లో భగీరథుడు గంగ కోసం ఘోర తపస్సు చేశాడు. కానీ మనం గోదారమ్మ తల్లిని ఉత్తరాంధ్రకు తీసుకురావడానికి చంద్రబాబుకు ఒకే ఒక్క ఓటు వేశాం. ఆ ఒక్క ఓటుతోనే నాసిక్‌లో పుట్టిన గోదావరి 180 కిలోమీటర్లు ప్రయాణించి మన పొలాల దాకా వచ్చింది" అని అన్నారు. గతంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న పాయకరావుపేట, నేడు ఆర్సెలర్ మిట్టల్ వంటి పరిశ్రమలతో పారిశ్రామిక, వ్యవసాయ ముఖద్వారంగా మారిందని తెలిపారు."ఒకే ఒక్క ఓటు గోదారమ్మను, ఆర్సెలర్ మిట్టల్‌ను, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను, పరిశ్రమలను తీసుకొచ్చింది. సరైన వ్యక్తికి సరైన సమయంలో ఓటు వేస్తే ఇంత అభివృద్ధి జరుగుతున్నప్పుడు, మాకు మరో వ్యక్తికి ఓటేయాలన్న ఆలోచన కూడా రాదు. మీరే మా ముఖ్యమంత్రి, మీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం" అని అనిత ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసే రోజు ఎంతో దూరంలో లేదని, ముఖ్యమంత్రి వెంటే తామంతా నడుస్తామని స్పష్టం చేశారు.

# పవన్ జన్మదిన వేడుకల్లో జనసేన జోష్





**శ్రీకాళహస్తిలో వందలాది బైకులతో భారీ ర్యాలీ.. మార్మోగిన జనసేన నినాదాలు**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. వందలాది బైకులతో జనసైనికులు, పార్టీ నాయకులు, వీర మహిళలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు.శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో జనసేన జెండాలు రెపరెపలాడగా, పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన నినాదాలతో పట్టణం మార్మోగింది. ఉత్సాహభరిత వాతావరణంలో జనసైనికులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'జనసేన యువజన విభాగం' కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. యువతకు దిశానిర్దేశం చేసే కార్యక్రమం పట్ల నాయకులు, జనసైనికులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేస్తామని వారు తెలిపారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐపై విద్యార్థులకు శిక్షణ అవసరం

**-ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే భవిష్యత్ అవకాశాలు**

**ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. మన్యం నరసింహులు**



**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
కళాశాల విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ఆధునిక ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమని ఎస్.వి.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. మన్యం నరసింహులు అన్నారు.స్థానిక ఎస్.వి.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం, గణితశాస్త్ర విభాగాలకు చెందిన విద్యార్థులు ప్రతిష్ఠాత్మక 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ', 'వైజర్' సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి 'క్వాంటమ్ టెక్నాలజీస్ ఫేజ్1' కోర్సును విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికెట్లు సాధించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. మన్యం నరసింహులు మాట్లాడుతూ.. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక అకడమిక్ క్రెడిట్ లభిస్తుందని తెలిపారు. ఈ క్రెడిట్‌ను విద్యార్థుల వ్యక్తిగత అపార్ ఐడీ ఖాతాల్లో డిజిటల్ విధానంలో నేరుగా జమ చేయడం విశేషమన్నారు.ప్రభుత్వ కళాశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక నైపుణ్యాలను సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా భవిష్యత్ ప్రపంచాన్ని నడిపించే సాంకేతిక రంగాలపై పట్టు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఎం. నరసింహులు, భౌతికశాస్త్ర విభాగ అధ్యాపకులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధ్యక్షులు డా. బావనయ్య, డా. పరంధామయ్య, డా. ప్రసన్నలక్ష్మి తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**- రైతుల సంక్షేమానికి,ఆధునిక వ్యవసాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- సూళ్లూరుపేట ఎం ఎల్ ఏ డా.నెలవల విజయశ్రీ**







**నాయుడుపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 2**
ఎల్-నినో ప్రభావంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున పంట ఎంపిక విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.బుధవారం నాయుడుపేట లోని ఏ ఎల్ సీ ఎమ్ హైస్కూల్ గ్రౌండ్ లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి ఎక్స్పో కిసాన్ మేళా-2026ను జిల్లా కలెక్టర్ ప్రారంభించి వ్యవసాయ మరియు అనుబంధ శాఖల విజ్ఞాన ప్రదర్శన స్టాల్స్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు,ఏడి అగ్రికల్చర్ నాగార్జున,ఏపి సిఎన్ఎఫ్ షణ్ముగం,సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి,నాయుడుపేట తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, శాస్త్రవేత్తలు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణంగా 32,000 హెక్టార్లలో సాగు జరుగుతుండగా కండలేరు నీటి లభ్యత,బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో ఈ ఏడాది సుమారు 52,000 హెక్టార్లలో సాగు చేపట్టమన్నారు.కాగా ఈ ఏడాది వర్షపాతం 32 శాతం తగ్గిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎల్-నినో ప్రభావంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున, కచ్చితమైన నీటి పారుదల సౌకర్యం లేని సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల రైతులు తొందరపడి వరి సాగు చేపట్టవద్దని కోరారు. తెలుగుగంగా కెనాల్ పరిధిలో ప్రస్తుతం 10 నుండి 12 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నందున, రాష్ట్రంలో నీటి లభ్యత తక్కువగా ఉందనే విషయాన్ని రైతులందరూ గమనించాలని తెలిపారు.ఎల్-నినో పరిస్థితులను ముందుగానే ఊహించి,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నాలుగు నెలల క్రితమే 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకునేలా అనుసంధాన కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులను పూర్తి చేసి,నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టమన్నారు. వర్షపాతం సరిగా లేకపోవడం, రానున్న 2-3 నెలల్లో కూడా వర్షాలు పడే అవకాశాలు తక్కువగా ఉండటంతో రైతులు తమ ప్రాంతంలోని నీటి లభ్యత, చెరువుల్లో ఉన్న నీటి మట్టాన్ని బట్టి పంటలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తక్కువ నీటితో మెరుగైన దిగుబడి సాధించేందుకు, భూసారాన్ని పెంచే పీ ఎం డి ఎస్ విత్తన గుళికల పంపిణీని ప్రారంభించామన్నారు.దీనిపై శాస్త్రవేత్తల సలహాలు,సూచనలు పాటించాలని సూచించారు. పంట ఎంపిక సమయంలో స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులందరూ సమష్టిగా సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రకాన్ని బట్టి వరి పంటకు రూ.1,800 నుండి రూ.2,400 వరకు మంచి ధర లభిస్తోందని, ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లోనూ మంచి ధరలు లభించే అవకాశం ఉందన్నారు.రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని,సంక్షేమ పథకాలు, అవగాహన కార్యక్రమాలు,అభివృద్ధి పనుల ద్వారా రైతాంగాన్ని పూర్తిగా ఆదుకుంటామన్నారు.ఈ దిశగా కృషి చేస్తున్న వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులను అభినందించారు.
సూళ్లరుపేట ఎంఎల్ఏ డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేసి, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి దిగుబడులను పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.డ్రోన్లు,ట్రాక్టర్లు తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలను భారీ సబ్సిడీతో రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని,తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నామనన్నారు. మట్టి పరీక్షలు,సమతుల్య ఎరువుల వినియోగం,కీటక నియంత్రణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.రైతు కుటుంబాలకు ఏటా రూ.20,000 ఆర్థిక సహాయం అందించడంతో పాటు,పంటల దిగుబడి సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ, పంటల బీమా,వ్యవసాయ సలహాల కోసం డిజిటల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులతో మమేకమై యూరియా సమతుల్య వినియోగం, డిజిటల్ సేవలు,ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.రైతులందరూ సబ్సిడీ పరికరాలు,ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.వ్యవసాయ శాఖ ఏడి మాట్లాడుతూ వర్షాధార రైతుల కోసం ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో 1520 రకాల విత్తనాల మిశ్రమాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.ఈ విధానం భూసారాన్ని పెంచడంతో పాటు అదనపు ఆదాయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు డ్రోన్లపై 80 శాతం సబ్సిడీ అందిస్తున్నామని, రూ.10 లక్షల విలువైన డ్రోన్‌కు రూ.8 లక్షల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 36 డ్రోన్లు మంజూరు కాగా 9 డ్రోన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, మరో 60 డ్రోన్ల మంజూరు ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని వెల్లడించారు. అదేవిధంగా రూ.500-1,000కే లభించే సోలార్ లైట్ ట్రాప్స్ వినియోగంతో పురుగుల ఉధృతిని తగ్గించి, రసాయన పిచికారీ ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులందరూ ప్రదర్శన స్టాళ్లను సందర్శించి,ప్రత్యామ్నాయ సాగు విధానాలు,డ్రోన్లు,ఆధునిక వ్యవసాయ పరికరాలపై అవగాహన పెంచుకొని,తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం సాధించే ఆధునిక పద్ధతులను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పసల గంగా ప్రసాద్,మైలారి రాజశేఖర్,నాన బాల సుబ్బారావు నిత్యా కృష్ణారెడ్డి, పోట్లపూడి రాజేష్,వినుకొండ ధనంజయ,పలుకూరు ముత్యాలయ్య,పెళ్ళకూరు గోపాలకృష్ణ,పసల సురేష్,కార్న రమణయ్య,కాపులూరు చక్రపాణి,బల్లి ముత్యాలయ్య, ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు,వాకిలి వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వైయస్సార్ సేవలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయం

**- 17వ వర్థంతి సందర్భంగా విగ్రహానికి పాలాభిషేకం.. ఘన నివాళులు**







**శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,సెప్టెంబర్ 02 :**
దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న ఆయన ముఖ్యమంత్రిగా ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పక్కా గృహాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, బడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు.వైఎస్సార్ చూపిన సంక్షేమ బాటలోనే మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి కూడా పలు సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలకు అండగా నిలిచారని వారు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలు, సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ బోర్డు సభ్యులు మున్నా రాయల్, పగడాల రాజు, కొత్తపాటి శ్రీనివాసులు రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సూర సురేష్ రాయల్, టౌన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసల కృష్ణయ్యతో పాటు పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో సీపీఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ డి. రాజాతో కత్తి రవి భేటీ

**- ప్రజా సమస్యలపై ఢిల్లీ వేదికగా గళమెత్తిన కమ్యూనిస్టు నేతలు**

**- కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి**

**ప్రజా ఉద్యమాలపై కీలక చర్చ**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి. రాజాను ఢిల్లీలో సీపీఐ నాయకులు కత్తి రవి కలిశారు. ఈ సందర్భంగా దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికులు, రైతులు, పేదలు, నిరుద్యోగులు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపారు.
కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య ప్రజలపై పెరుగుతున్న భారాన్ని తగ్గించేందుకు వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. కార్మిక, కర్షక, యువజన, విద్యార్థి, మహిళా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఉద్యమాలను విస్తృతం చేయాలని చర్చించినట్లు పేర్కొన్నారు.

**ప్రజల పక్షాన పోరాటమే సీపీఐ లక్ష్యం**

ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందని కామ్రేడ్ డి. రాజా స్పష్టం చేసినట్లు కత్తి రవి తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలను ఐక్య పోరాటాల ద్వారా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు.
ప్రస్తుతం దేశ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడం, యువతను ఉద్యమాల్లో భాగస్వాములను చేయడం, సామాన్య ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు వెల్లడించారు.

**ఢిల్లీ వేదికగా కీలక భేటీ**

సీపీఐ జాతీయ నాయకత్వంతో జరిగిన ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని కత్తి రవి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తూ, దేశవ్యాప్తంగా వామపక్ష శక్తులను ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను మరింత బలపరచాల్సిన అవసరం ఉందన్నారు.
ప్రజల హక్కుల కోసం పోరాటమే లక్ష్యం.. సామాజిక న్యాయం సాధించే వరకు ఉద్యమమే మార్గం" అనే నినాదంతో సీపీఐ ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని కత్తి రవి పిలుపునిచ్చారు.

# నాయుడుపేటలో ఘనంగా మాజీ సీఎం వైయస్సార్ వర్ధంతి వేడుకలు





**- ప్రజల గుండెల్లో కొలువైన దేవుడు వై.యస్.ఆర్**

**- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**

**నాయుడుపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 2**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు బుధవారం నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్థానిక నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల దివంగత మహానేత డాక్టర్ వై.యస్.ఆర్ విగ్రహానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ
పేదల గుండెల్లో దేవుడిగా కొలువైన మహానేత,మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు.వైయస్సార్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల తోపాటు సంక్షేమ పథకాలను నేటికి ప్రజలు గుర్తు చేసుకుంటారన్నారు. డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి పరిపాలన ఒక స్వర్ణయుగమని, మళ్లీ అలాంటి పాలను అందించగలిగే నాయకుడు వైయస్సార్ తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు.డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజాపాలన నేటికి పేద ప్రజలు మరువలేదని, వైయస్సార్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో పేద ప్రజలకు విద్య,వైద్యం అందే విధంగా,రైతులకు వ్యవసాయానికి ఊతమిచ్చే విధంగా సంక్షేమ పథకాలను తెచ్చి ప్రజాబంధుగా నిలిచారన్నారు.తండ్రి వైయస్సార్ పాలను ఆదర్శంగా తీసుకొని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అన్నారు.
ప్రశ్నించే గొంతుకు అణగదొక్కడం తప్ప ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి పార్టీలు చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి గ్రావెల్,ఇసుక, మట్టి,లిక్కర్ అక్రమ దందాలు నడపడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు.భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.ఇచ్చిన హామీలను నెరవేర్చమని ప్రతిపక్షంగా పోరాడుతుంటే వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద, పార్టీ నాయకుల మీద చంద్రబాబు ప్రభుత్వం అనునిత్యం విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి,వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, నాయుడుపేట ఏఎంసి మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, వైసీపీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,వైసీపీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి,నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కటకం దీపిక,నాయుడుపేట ఎంపీపీ కొరుగొండ ధనలక్ష్మి, వైసీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, వైయస్సార్సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు చదలవాడ కుమార్, వైసిపి మైనారిటీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు షేక్ షబ్బీర్, వైసిపి నాయకులు బైన మల్లికార్జున్ రెడ్డి,పేట చంద్రారెడ్డి, గంధవల్లి సిద్దయ్య,షేక్ రహంతుల్లా,పేర్నాటి రాహుల్, కావేరి పాకం అశోక్ కుమార్ నెలవల రవి,రాయపు శేఖర్,రమణయ్య,భాను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా

**కండదు పంచాయతీలో కేక్ కట్ చేసి సంబరాలు ప్రజాసేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని జనసేన నాయకుల పిలుపు**





ఏర్పేడు మండలం, పెన్ పవర్ ,సెప్టెంబర్ 02:జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పేడు మండలం కండదు పంచాయతీలో జనసేన శ్రేణులు ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన ముఖ్య నాయకులు మల్లీగుంట మునిశేఖర్, నాన్న శ్రీ సురేంద్రబాబు, వంశీ యాదవ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, సమాజ అభివృద్ధికి జనసేన కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కండదు పంచాయతీలో నిర్వహించిన ఈ వేడుకలు స్థానికంగా సందడి వాతావరణాన్ని నెలకొల్పగా, కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పాత వీరాపురంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం

### పాలాభిషేకం, ప్రత్యేక పూజలు.. వైఎస్సార్‌కు వైసీపీ నేతల ఘన నివాళులు




**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
ఏర్పేడు మండలం పాత వీరాపురం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.
అనంతరం వైఎస్సార్ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, నాయకులు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ప్రజలకు అందించిన సేవలను, సంక్షేమ పథకాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, మోహన్ రెడ్డి, పాతగుంట గురువారెడ్డి, చిన్నింటివారి హరిదాసు, కొంగర మునిరత్నం రెడ్డి, రెడ్డిపెళ్లకూరు మునిరత్నం రెడ్డి, కావలి రెడ్డప్ప, సుండి జమున, పాతగుంట సాంబశివారెడ్డి, సుండి బాలాజీ తదితర పాత వీరాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## YSR ఘాట్ వద్ద కాంగ్రెస్ నేతల ఘన నివాళులు

### ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత వైఎస్సార్ : కాంగ్రెస్ నేతలు





**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సమాధి వద్ద అంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ.. వైఎస్సార్ ప్రజాబంధువుగా ప్రజల మనసులు గెలుచుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతల్లో వైఎస్సార్ ఒకరని, ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా తన పాలన సాగించారని అన్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. జలయజ్ఞం ద్వారా రైతుల అభివృద్ధికి విశేష కృషి చేసి వైఎస్సార్ రైతుల ఆపద్బాంధవుడిగా నిలిచారని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించి సంజీవనిగా మారారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మహిళా నాయకురాళ్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

## వీధి మధ్యలో ప్రమాదకరంగా 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

– పలుమార్లు పత్రికల్లో ప్రచురించినా స్పందించని అధికారులు.. ప్రమాదం జరిగేలోపు చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



**ఏర్పేడు , పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
ఏర్పేడు మండలంలోని మోదుగులపాల్యం గ్రామంలో వీధి మధ్యలో 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితిలో ఉండటంతో పాటు, మనిషి చేయి ఎత్తితే తగిలేంత తక్కువ ఎత్తులో ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా వీధిలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు వంటి వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై పలుమార్లు పత్రికల్లో ప్రచురించినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం గమనార్హమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించేలోపు అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసి, సురక్షిత ప్రాంతానికి తరలించాలని స్థానికుడు మంచు మస్తాన్ నాయుడు కోరారు.

# నాయుడుపేటలో ఘనంగా జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### - ఉత్సాహంగా సాగిన బైక్ ర్యాలీ,అనంతరం అన్నదానం



**నాయుడుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 2**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు బుధవారం సూళ్లూరుపేట నియోజకవర్గం,నాయుడుపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బైక్ ర్యాలీతో పాటు జనసేన యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీలో నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ ) చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో జనసేన నాయకులు, జనసైనికులు,వీరమహిళలు, యువత బైక్ ర్యాలీలో పాల్గొని పార్టీ జెండాలను చేతబట్టి జనసేనానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. గాంధీ మందిరం వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీదర్గా,అంబేద్కర్ విగ్రహం, అమరావతి సర్కిల్ మీదుగా నాయుడుపేట జనసేన పార్టీ కార్యాలయం వరకు ఉత్సాహభరితంగా నిర్వహించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ లో జనసేన పార్టీ పి ఏ సీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ నాయకులు,కార్యకర్తలు, యువతతో అనుసంధానమయ్యారు. ఈ సందర్భంగా జనసేన యువజన విభాగం లోగో, గీతం ఆవిష్కరణ కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలలో విజయానికి కీలకమైన నాయకత్వాన్ని అందించిన వారిలో పవన్ కళ్యాణ్ పాత్ర అత్యంత ముఖ్యమైనదని తెలియజేశారు. ఆయన రాజకీయ ప్రయాణం మనకు ఒక విషయాన్ని



నేర్పిందన్నారు. ఓటమి వచ్చినా వెనక్కి తగ్గకూడదు. ఎన్ని అవమానాలు ఎదురైనా సిద్ధాంతాన్ని వదులుకోకూడదు. ప్రజల కోసం నిలబడితే ఒకరోజు ప్రజలే అండగా నిలుస్తారు. అదే పవన్ కళ్యాణ్ పోరాట స్ఫూర్తి అని కొనియాడారు.

జనసైనికుడికి పదవి ముఖ్యం కాదు. పవర్ ముఖ్యం కాదు. డబ్బు ముఖ్యం కాదు. ప్రజల కోసం పనిచేయడం ముఖ్యం. పార్టీ సిద్ధాంతాలను కాపాడటం ముఖ్యం. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును నిర్మించడం ముఖ్యం అని ఉయ్యాల ప్రవీణ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ నిర్ణయం తీసుకున్నా ఆ నిర్ణయాన్ని అర్థం చేసుకుని క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిదన్నారు. పదవులు తుచ్ఛం... ప్రజాసేవే లక్ష్యం! స్వార్థం కాదు... సమాజ హితం మన ధ్యేయం! అని ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన 6మండలాలు 2 మున్సిపాలిటీల జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నాయుడుపేటలో నిర్వహించిన ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## టీడీపీకి కార్యకర్తలే వెన్నుముక.. పార్టీ బలోపేతమే లక్ష్యం!

### యూనిట్ ఇన్‌చార్జి నెమళ్లూరు బుజ్జి

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 02:**
కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని, పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని యూనిట్ ఇన్‌చార్జి నెమళ్లూరు బుజ్జి అన్నారు. బుధవారం ఎన్టీఆర్ నగర్‌లో టీడీపీ యూనిట్ నెంబర్ 13 సమావేశం బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు.
టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దిశానిర్దేశంతో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే యూనిట్ స్థాయి సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.
ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ.. టీడీపీకి కార్యకర్తలకు విడదీయరాని అనుబంధం ఉందని, పార్టీ విజయానికి కార్యకర్తల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు.
యూనిట్ పరిధిలో కార్యకర్తలు గుర్తించిన ప్రజా సమస్యలు, అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఆయా సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు.




ఈ సమావేశంలో బూత్ ఇన్‌చార్జీలు ఆకుల సునీత, మెదూరు శివకుమార్, చెంబేటి బాలయ్య, తోకల భరత్ కుమార్తో పాటు నాయకులు పూల శేఖర్, కోటాచారి, హబీబ్, రియాజ్, జిలాని, శంకరయ్య, రమేష్ బాబు, శివ, వాసు, ఇంతియాజ్, చెంచయ్య, తేజ, హరి, గోపి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత వైయస్సార్ సేవలు ఎన్నటికీ మరువలేనివే

### " మాజీ ఎమ్మెల్యే కిలివేటి '

**నాయుడుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 2**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ మహనీయుని ఎన్నటికీ మరువలేమని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వైయస్సార్ 17వ వర్ధంతిని పురస్కరించుకొని నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేశారు. జయహో వైయస్సార్... జయ జయహో వైయస్సార్ అంటూ నినాదాలు చేశారు. పార్టీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభిమాన ముఖ్యమంత్రి, పేదల అభివృద్దే ఆశయంగా ఎన్నో పథకాలను అమలు చేసిన దివంగత నేత డాక్టర్ వైయస్సార్ అని కొనియాడారు. భౌతికంగా మృతి చెందిన, ఆత్మీయంగా పేదల గుండెల్లో ఎన్నటికీ కొలువై ఉంటారని పేర్కొన్నారు. ఆయన పరిపాలన స్వర్ణ యుగంగా సాగిందని మళ్లీ అలాంటి పాలనే అందించగలిగే నాయకుడు వైయస్సార్ తనయుడు, వైయస్ జగన్మోహన్ రెడ్డి అనే అన్నారు. వైయస్సార్ పరిపాలనలో పేద ప్రజలకు విద్యా సౌకర్యాలు, ఆరోగ్యశ్రీ పథకం, రైతులను ఎన్నో విధాలుగా ఆదుకున్న నాయకుడని గుర్తు చేశారు.
అదేవిధంగా నేడు పరిపాలనలో ఉన్న కూటమి ప్రభుత్వ నాయకులు, బహిరంగంగా గ్రావెల్, ఇసుక, మట్టి, లిక్కర్ అక్రమ దందాలు నడపడం తప్ప ప్రజలకు మేలు చేసింది ఏమిటని సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, ఇచ్చిన హామీలను నెరవేర్చక గాలికి వదిలేయడంపై విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ చైర్ పర్సన్ కటకం దీపిక, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబి రెడ్డి జనార్ధన్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కలికి. మాధవరెడ్డి , అధికార ప్రతినిధి కామిరెడ్డి రాజారెడ్డి,కిషోర్ యాదవ్, మాజీ ఎంపీపీ కురుకొండ్ల. ధనలక్ష్మి వెంకట కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రత్నశ్రీ, పలువురు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జనసేన నాని జన్మదినం.. శ్రీకాళహస్తిలో వేడుకల జాతర!

### – దండి నరేంద్ర ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల జోరు.. జనసైనికుల్లో నూతనోత్సాహం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 02:**
జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. జనసేన నాయకుడు దండి నరేంద్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు, భారీ ర్యాలీలు, అన్నదానాలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆలయంలో పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలు, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, దృఢమైన నాయకత్వం కోసం ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముచ్చివోలు నుంచి రేణిగుంట వరకు సుమారు 200 బైకులతో 78 కిలోమీటర్ల భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జనసేన సందేశాన్ని చాటిచెప్పారు. భారీ




ఎల్ఈడీ స్క్రీన్‌పై 'జై కొట్టు' కార్యక్రమాన్ని జనసైనికులతో కలిసి వీక్షించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనాథాశ్రమంలో సుమారు 70 మందికి అన్నదానం, కందాడు పంచాయతీ పరిధిలో మొక్కలు నాటడం, శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 500 మందికి అన్నదానం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రేణిగుంట, కందాడు, బి.పి. అగ్రహారం, ముచ్చివోలు, అమందూరు, మద్దిలేడు, వాగవేడు, సూరవారిపల్లె, విప్పమనపట్టెడ తదితర ప్రాంతాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించగా, కరకంబాడిలో జనసేన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండి నరేంద్ర మాట్లాడుతూ జనసైనికుల ప్రేమే నా బలం.. వారి నమ్మకమే నా బాధ్యత" అని అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా జనసైనికులు, నాయకులు, అభిమానులు చూపించిన ప్రేమ, ఆప్యాయత తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తనపై ప్రజలు, జనసేన నాయకులు, జనసైనికులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సమయం పరిమితి కారణంగా హాజరు కాలేకపోయిన మరికొన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ, జనసేన నాని జన్మదిన వేడుకలను విజయవంతం చేసిన ప్రతి జనసైనికుడికి, పార్టీ నాయకులకు, అభిమానులకు దండి నరేంద్ర హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నాని పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయనకు ఆయురారోగ్యాలు, శక్తి, ప్రశాంతత, మరింత బలమైన నాయకత్వాన్ని ప్రసాదించాలని శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని ప్రార్థించారు.

# రొంపిచెర్లలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన.



**పెన్ పవర్ రొంపిచర్ల మండలం సెప్టెంబర్ 2**
: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రొంపిచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన టీఏ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్సీ కమిషనర్‌ను నియమించి, ఉద్యోగులకు వేతన సవరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని కోరారు. కొత్త పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం**
వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మండల సర్వేయర్ ద్వారకనాథ్, జూనియర్ అసిస్టెంట్ ముని శేఖర్, వీఆర్వో లు సుబ్రహ్మణ్యం, సురేంద్ర, బావాజీ, శ్రీనివాసులు, శ్రీరాములు, అటెండర్ చాంద్ సుల్తాన, వీఆర్ఏ లు నజీర్ సాహెబ్, ఇర్ఫాన్ అలీ, నరేష్, దామోదర్, మల్లికా, శిరీష, రామచంద్ర, విశ్వనాథం, రాజన్న, ధనశేఖర్, వెంకటరమణ,విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసు ఛేదన.. ముగ్గురి అరెస్ట్



**ప్రతినిధి ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 2**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో అంబడి చిన్న ఆంజనేయులు అలియాస్ అంజి (32) హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడి భార్య అంబడి నాగసుబ్బులు, కల్లూరి గురు ప్రసాద్‌తో ఉన్న సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో అతడిని హత్య చేసేందుకు పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గురు ప్రసాద్ తన స్నేహితుడు షేక్ షరీఫ్‌తో కలిసి ఆగస్టు 31 రాత్రి పార్టీ చేసుకుందామని చెప్పి ఆంజనేయులను వెంట తీసుకెళ్లి మద్యం తాగించి బండరాయితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య జరిగిన ప్రదేశంలో లభించిన మద్యం సీసా మూతపై ఉన్న సంకేత సంఖ్య ఆధారంగా మద్యం దుకాణం, కొనుగోలు సమయాన్ని గుర్తించారు. అక్కడి నిఘా కెమెరాల దృశ్యాలతో పాటు నిందితులు సంచరించిన మార్గాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

నాగసుబ్బులు, కల్లూరి గురు ప్రసాద్, షేక్ షరీఫ్‌లను అరెస్ట్ చేసి న్యాయస్థానానికి హాజరుపరిచి రిమాండ్‌కు పంపారు. కేసును 24 గంటల్లో ఛేదించిన సీఐ జి.వి. నాగరాజరావు, ఎస్ఐ బి. చిన్న పీరయ్య, ఆళ్లగడ్డ గ్రామీణ ఎస్ఐ యు.వి. వరప్రసాద్, పోలీసు సిబ్బంది ఉదయ్‌కుమార్, మహమ్మద్ రఫీలను ఉన్నతాధికారులు అభినందించారు

# శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు...



**శ్రీశైలం పెన్ పవర్ సెప్టెంబర్ 2**

నంద్యాల జిల్లా శ్రీశైలం దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నంద్యాల టర్నింగ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి వైఎస్ఆర్ స్మృతివనం వద్ద శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మహానేత వైఎస్ఆర్ ప్రజాసంక్షేమ పాలన, పేదల పట్ల ఆయన చూపిన అంకితభావం, రైతు సంక్షేమం కోసం చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. మహానేత వైఎస్ఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పుదూరు పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**నాయుడుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 2**

నాయుడుపేట మండల పరిధిలోని పుదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణం, పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రతకు, పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ప్రాంగణంలోకి పాఠశాల సమయంలో కుక్కలు, మరే ఇతర జంతువులు లోనికి ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ టైల్స్ మంజూరు చేయాలని కలెక్టర్ ని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి మంజూరు చేస్తున్నట్లు సమస్యను అక్కడే పరిష్కరించారు. పిల్లల విద్యా బోధనలోనూ, మధ్యాహ్న భోజన పథకంలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దేవేందర్ రెడ్డి, నాయుడుపేట తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుగోడు జలాశయం ముట్టడి పేరుతో వైసీపీ డ్రామాలు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆగ్రహం





**నంద్యాల,ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 2**

నంద్యాల జిల్లా వెలుగోడు మండలం జలాశయం ముట్టడి పేరుతో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు నిర్వహించిన సమర శంఖారావం కార్యక్రమంపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మంత్రులు ఎన్.ఎం.డి ఫరూఖ్, బిసి జనార్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధి లేకుండా కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే వైసీపీ నేతలు ఇలాంటి డ్రామాలు చేస్తోందని విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగానే సాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. ఆరు నెలల ముందుగానే రైతులకు నీరు అందించే పరిస్థితి లేదని ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించినప్పటికీ, ఇప్పుడు రైతులను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు రాజకీయ డ్రామాలకు తెరలేపడం దురదృష్టకరమన్నారు. తండ్రి, కొడుకులు చక్రపాణి రెడ్డి, శిల్పా రవికిషోర్ రెడ్డిలు కలిసి మంచి డ్రామాలు ఆడుతున్నారు. రైతుల మేలు కోసం కాదు, కేవలం రాజకీయ ఉనికి కోసం ఈ డ్రామాలు అని ఎమ్మెల్యే బుడ్డా మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీగా వైసీపీ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ అధికారంలో ఉండగా ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీగా రైతుల ప్రయోజనాల కోసం చేసిన పోరాటాల తేదీలు, సందర్భాలు మరిచారా అని వైసీపీ నేతలను ప్రశ్నించారు. శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతులకు ఎన్ని సార్లు సాగునీరు అందించారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. సాగునీరు ఇస్తానని మాట ఇచ్చి ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిన శిల్పా చక్రపాణి రెడ్డి శంఖారావాలతో డ్రామాలు చేస్తే సహించేదిలేదన్నారు. సాగునీటి సమస్యల పరిష్కారం కోసం గతంలో కర్నూలుకు వెళ్లి అప్పటి జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డుకున్న ఘటనలను ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు. అప్పట్లో రైతుల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు రైతు ప్రేమికులుగా నటించడం హాస్యాస్పదమన్నారు. ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని, రైతులకు ఏ విధంగా సాగునీరు అందించాలనే అంశంపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం అన్ని కోణాల్లో చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. వైసీపీ నేతల రాజకీయ ఆరోపణలు, ప్రచారాలను రైతులు నమ్మవద్దని కోరిన ఎమ్మెల్యే, రైతుల సంక్షేమం కోసం ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి నిర్ణయం రైతు ప్రయోజనాల దృష్ట్యానే తీసుకుంటున్నామని వెల్లడించారు.

# దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్‌కి ఘన నివాళి... వైసీపీ

**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గృహంలో 17వ వర్ధంతి, ఘన నివాళులు**

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలించిన వైఎస్సార్ ఆదర్శప్రాయుడు: వైఎస్సార్‌సీపీ నేతలు**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 2**

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గృహంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. అలాగే నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్ సాయిబాబా నగర్, చామకాల్వ సెంటర్లలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అబ్జర్వర్ సద్దల సూర్యనారాయణ రెడ్డి,

రాష్ట్ర సంయుక్త ప్రచార కార్యదర్శి బుల్లెద్దుల రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి విజయ శేఖర్ రెడ్డి, మాజీ బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, వైసీపీ జిల్లా డాక్టర్స్ వింగ్ డా. సుబ్బారెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా వైసీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, , జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టి.వి రమణ, వైసీపీ రాష్ట్ర ర్ సెల్ జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, వైసిపి రాష్ట్ర (ఎస్. టీ) సెల్ కార్యదర్శి ఆంజనేయులు, వైసీపీ మండల అధ్యక్షులు బసవేశ్వర రెడ్డి, వైసీపీ జిల్లా సెక్రటరీ దేవానగర్ బాషా, మరియు మాజీ కౌన్సలర్స్, వార్డు ఇంచార్జ్ లు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పి.పి. నాగిరెడ్డి మాట్లాడుతూ... డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వర్ణనాతీతమని కొనియాడారు.

జలయజ్ఞం ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులను నిర్మించి వైఎస్సార్ 'జలయజ్ఞ ప్రదాత'గా నిలిచారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్ వంటి విప్లవాత్మక పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో సాగునీరు, తాగునీటి



సమస్య తీవ్రంగా ఉంద ని, దీనిపై పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని పి పి నాగిరెడ్డి డిమాండ్ చేశారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి బాటలోనే నడుస్తూ రాష్ట్రంలో మెరుగైన సంక్షేమ, అభివృద్ధి పాలన అందించారని పేర్కొన్నారు.

మహానేత వైఎస్సార్ ఆశయ సాధనకు, ఆయన చూపిన బాటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.

# ఆళ్ళగడ్డ లో అంగరంగ వైభవంగా డిప్యూటీ సీఎం శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు

**ఆళ్ళగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య.**

**ఆళ్లగడ్డ పెన్ పవర్ సెప్టెంబర్ 2**

ఆళ్ళగడ్డ: జనసేన పార్టీ అధ్యక్షులు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భముగా ఆళ్ళగడ్డ పట్టణం లో జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో బారి బైక్ ర్యాలీ నాలుగు రోడ్ల సర్కిల్ నుండి పడకండ్ల బ్రిడ్జి వరకు నిర్వహించడం జరిగింది.

పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ యువజన విభాగం లోగోను వర్చువల్ గా ఆవిష్కరించారు

పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఉయ్యాలవాడ మండలం, ర్ .పాంపల్లి గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరించిన మైలేరి మల్లయ్య.

రక్తదాన శిబిరంలో భారీ ఎత్తున జనసైనికులు రక్తదానం చేశారు.

అనంతరం మైలేరి మల్లయ్య మాట్లాడుతు ప్రజల కోసం నిరంతరం పరితపిస్తూ కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ కి ప్రతి ఒక్కరు అండగా నిలిచి ఆయనను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

పవన్ కళ్యాణ్ కి సంపూర్ణ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలగాలని, మరిన్నీ ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఆకాంక్షించారు.

జనసేన కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి, అనంతరం అన్నదాన



కార్యక్రమము నిర్వహించారు.

జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్క పనిచేయాలని నాయకులుకు, కార్యకర్తలకు, వీరమహిలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పసుల నరేంద్ర యాదవ్, షేక్ జమాల్ బాషా, వేముల కోటి, సూర సురేంద్ర, యనమల తేజ్ కుమార్, షీల్ల సుబ్బరాయుడు,

రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, ఆవుల జగదీష్, పగడాల ప్రతాప్, దేవా ఆంజనేయులు, బావికాడి గుర్రప్ప, అశోక్, షరీఫ్, రామిశెట్టి బ్రహ్మేంద్ర కుమార్, గరుగు సుబ్బయ్య,

రమణచారి, నగిరి శ్రీకాంత్, సూర నరసింహులు, బరిగెల కేశవ, షరీఫ్ తుమ్మల ఈశ్వరయ్య కూటమి నాయకులు తదితరులు





పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం.

**పెన్ పవర్ రొంపిచర్ల మండలం సెప్టెంబర్ 2**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని రొంపిచెర్ల మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కరీముల్లా ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి లు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని కొనియాడారు.

ప్రత్యేకంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేశారని తెలిపారు. రైతుల సంక్షేమానికి ఉచిత విద్యుత్ అందించడంతో పాటు వ్యవసాయ రంగానికి అండగా నిలిచారని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన 'రచ్చబండ' వంటి కార్యక్రమాల ద్వారా వైఎస్సార్ ప్రజలకు మరింత చేరువయ్యారని నాయకులు అన్నారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, విద్య, వైద్య రంగాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు.

ప్రజల కోసం నిరంతరం శ్రమించిన వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ శేఖర్, వైఎస్సార్సీపీ నాయకులు చెంచు రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మహబూబ్ బాషా, అల్లాబక్షు, హరికృష్ణ రెడ్డి, శ్రీనాథ నాయుడు, మునికృష్ణా రెడ్డి, ఓబులేష్, రామనారాయణరెడ్డి, మంజూర్, బావాజీ సాహెబ్, గురు తదితరులు పాల్గొన్నారు.

# కర్మాగారాల్లో భద్రత తప్పనిసరి..

## ఎస్‌పీవై ఆగ్రో అత్యధిక తీవ్ర ప్రమాదకర కర్మాగారం--



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 02:**

నంద్యాల లో ని కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశించారు. ముఖ్యంగా ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను అత్యధిక తీవ్ర ప్రమాదకర కర్మాగారంగా గుర్తించిన నేపథ్యంలో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, యాజమాన్య ప్రతినిధులకు సూచించారు.

కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా సంక్షోభ నిర్వహణ బృందం సమావేశంలో కర్మాగారాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఎస్‌పీవై ఆగ్రోలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే చేపట్టాల్సిన కార్యాచరణ, అందుబాటులో ఉన్న భద్రతా ఏర్పాట్లపై ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్మాగారాల్లో మాక్‌డ్రిల్లను తరచూ నిర్వహించి లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 32 కర్మాగారాలను ప్రమాదకర కర్మాగారాలుగా గుర్తించగా, వాటిలో ఎస్‌పీవై ఆగ్రోను అత్యధిక తీవ్ర ప్రమాదకర కర్మాగారంగా గుర్తించినట్లు ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఐ. నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో పోలీస్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ, విద్యుత్, వైద్య, రవాణా తదితర శాఖల అధికారులు, వివిధ కర్మాగారాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతపై పోలీసుల అవగాహన....

**నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు**





**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 2**

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కళాశాలల్లో పోలీస్ అధికారులు విద్యార్థినీ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల భద్రత, శక్తి యాప్, బాలలపై నేరాలు, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మైనర్ డ్రైవింగ్, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి మహిళ తమ మొబైల్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, శక్తి యాప్ నంబర్ 7993485111 గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నారులపై నేరాలు లేదా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 1098కు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే అనుమానాస్పద మెసేజ్లు, లింకులు, ఫేక్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఓటీపీ , బ్యాంక్ వివరాలు, పిన్ తదితర రహస్య సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఎక్కడైనా ఈవ్ టీజింగ్ లేదా ర్యాగింగ్ జరిగితే భయపడకుండా 112 లేదా 100 కు సమాచారం అందించాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనం నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం లేదా మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదని విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులు ఈ విషయాలను తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేసి వారిని అప్రమత్తం చేయాలని పోలీస్ అధికారులు సూచించారు. విద్యార్థుల భద్రత, మహిళల రక్షణ మరియు సైబర్ నేరాల నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# పాఠశాల పనులపై కలెక్టర్ సీరియస్..




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబరు 02:** ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల పనుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి 'మన బడిమన భవిష్యత్తు' పనుల పురోగతిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పూర్తయిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫోటోలతో సహా పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేసి క్లోజ్ చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను సందర్శించి హెచ్‌ఎంలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ, మరమ్మతులు, ఫర్నిచర్, డ్యూయల్ డెస్క్‌లు, పెయింటింగ్ తదితర పనుల ప్రస్తుత స్థితిని అప్‌డేట్ చేయాలన్నారు. డీఈఓ, ఎంఈఓలు మండలాల వారీగా పురోగతిని పర్యవేక్షించి, డేటా నమోదులో ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

# పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నంద్యాలలో రక్తదాన శిబిరం





## ప్రారంభించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 02:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన రక్త నిధి ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపాలిటీ ఆఫీస్ పక్కన ఉన్న పి.ఎ.వి కాంప్లెక్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా 'మహా రక్తదాన శిబిరం' నిర్వహించారు. విజయ బ్లడ్ సెంటర్ (నంద్యాల) వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , తాతిరెడ్డి మనీష్ రెడ్డి ముఖ్యఅతిథిలుగా విచ్చేసి శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పోకుండా, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఇలా రక్తదాన శిబిరాలుగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ప్రజలకు నిరంతరం సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు రాచమడుగు చందు, రాచమడుగు సుందర్, రాచమడుగు రాంబాబు, సంఘ జయంతి, బుగ్గ రాముడు, గోవింద నాయుడు, సాయిరాం రాయల్ తదితరులుపాల్గొన్నారు

# సేవా కార్యక్రమాలతో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**






**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 02:**

జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన శ్రేణులు పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు తోట గణేష్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అల్పాహార విందు, కేక్ కటింగ్, గోపూజ, గోమాతలకు గ్రాసం, పండ్ల పంపిణీతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు.ఎర్పేడు పట్టణంలోనూ కేక్ కటింగ్, మజ్జిగ పంపిణీ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అభాగ్యులకు చేయూతనిస్తూ మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన సహాయాన్ని అందించారు. ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు జనసైనికులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.అలాగే అలిపిరి మెట్ల వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామివారి పాదాల చెంత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ 1,000 కొబ్బరికాయలు సమర్పించారు.ఈ సందర్భంగా జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సేవా స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు.కేక్ కటింగ్‌తో పాటు రక్తదానం, అన్నదానం, గోసేవ, మొక్కల నాటకం, పేదలకు చేయూత.. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహించిన జనసేన శ్రేణులు.

# ప్రసన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన తెలుగు యువత నాయకులు

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 2.**



నియోజకవర్గ కేంద్రమైన కోవూరు లో బుధవారం మాజీ ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై చేసిన అసంధర్భ వ్యాఖ్యలపై బుచ్చిరెడ్డిపాలెం మండల తెలుగు యువత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని మగతనం ఉంటే ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడమంటూ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. మగతనం అంటే గత ఎన్నికలలో ప్రసన్న కుమార్ రెడ్డి పై తన శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని పోటీ చేయించి 25 రోజులలో 54 వేల కోట్ల మెజారిటీతో గెలిపించుకోవడంకాదా, అలాగే తాను ఎంపి గా పోటీ చేసి రెండు లక్షల 50 వేల ఓట్ల మెజార్టీతో గెలవడం కాదా అని వారు ప్రశ్నించారు. వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో రాజకీయాల గురించి మాట్లాడకూడదనే విషయం కూడా తెలియని ప్రసన్న కుమార్ రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా ఎలా అయ్యారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఇంకోసారి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై అవాకులు, చవాకులు పేలితే తాము కూడా తదనుగుణంగా స్పందించవలసి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో బుచ్చిరెడ్డిపాలెం మండల తెలుగు యువత నాయకులు కె.వి కిషోర్, ప్రసాద్, సుమన్, మహేంద్ర, టిడిపి పట్టణ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుబహాని, టిడిపి అర్బన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షులు బెజవాడ జగదీష్, పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య, నాయకులు కె.వి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిలో ఘనంగా వైయస్సార్ వర్ధంతి వేడుకలు

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 2.**



ప్రియతమ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు బుధవారం బుచ్చిరెడ్డిపాలెంలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక బస్టాండ్ సెంటర్లో గల వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ షాహుల్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రివర్యులు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్య, వైద్యానికి పెద్దపీటవేశారని, అలాగే ఉచిత విద్యుత్తుతో రైతులకు అండగా నిలిచారన్నారు. జలయజ్ఞం ఆయన మానస పుత్రిక అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకంతో వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారన్నారు. దీంతో ఉన్నత చదువులు అభ్యసించిన విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో సైతం ఉద్యోగాలు పొంది తమ భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఆయన భౌతికంగా ప్రజల మధ్య లేకపోయినప్పటికీ ప్రజల గుండెల్లో ఆయన ప్రత్యేక స్థానం ఏర్పరుచు కున్నారన్నారు. అనంతరం ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా తండ్రి బాటలో పయనించి ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు ఏర్పాటు చేశారన్నారు.రానున్న ఎన్నికల్లో తిరిగి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు సమయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అనంతరం మహిళ నేతలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు సతీష్ రెడ్డి,కౌన్సిలర్లు ప్రమీలమ్మ, మోర్ల జయంతి, షేక్ షకీల, యానాది రెడ్డి, నాయకులు మోర్ల భరత్ కుమార్ డాక్టర్ అల్లబక్షు,స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసిపి యువజన విభాగం నాయకుని రాజీనామా



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 2.**

బుచ్చిరెడ్డిపాలెం మండల వైసిపి యువజన విభాగానికి చెందిన నాయకుడు షేక్ చిన్న అల్లాబక్షు బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. ఇటీవల కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆయన పార్టీలో ఆశించిన స్థాయిలో పనితీరు లేకపోవడం, విలువలతో కూడిన రాజకీయం లేకపోవడం, తాను ఆశించిన రీతిలో ప్రజలకు సేవ చేయలేకపోయాననే తదితర కారణాలతో, అదేవిధంగా వేమిరెడ్డి దంపతుల సేవా దృక్పథానికి ఆకర్షితుడనై పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మీడియాకు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించవలసిందిగా పార్టీ జిల్లా అధ్యక్షునికి రాజీనామా లేఖను పంపుతున్నట్లు అల్లా బక్షు తెలిపారు. అయితే తన భవిష్యత్ రాజకీయ కార్యచరణ పై ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు.

# ఉత్తమ కార్యకర్తల ప్రశంసా పత్రాలకు చెత్త గతి..!!

..పార్టీ కోసం పనిచేసిన వారికి ఇదేనా గుర్తింపు..??

..జిల్లా టీడీపీ కార్యాలయం పక్కనే గుట్టలుగా పడేసిన వైనం..!!

..కార్యకర్తల కష్టాన్ని అవమానించడమేనంటూ మండిపాటు..!!

..సీఎం చంద్రబాబు ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారంటూ కార్యకర్తల ఆవేదన..!!







**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 2**
..నంద్యాల జిల్లా..
..పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలను గుర్తించి గౌరవించాల్సింది పోయి..వారికి అందించాల్సిన 'ఉత్తమ కార్యకర్త' ప్రశంసా పత్రాలను జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం పక్కనే చెత్తకుప్పలుగా పడేయడం దారుణమంటూ నంద్యాల నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..!!
..“బాబు ష్యూరిటీ--భవిష్యత్తుకు గ్యారంటీ“ 202324 కార్యక్రమంలో చురుగ్గా పనిచేసిన కార్యకర్తలను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు అందించేందుకు వీటిని సిద్ధం చేసినట్లు పత్రంపై ఉన్న వివరాలను బట్టి తెలుస్తోంది.అయితే ఎంతో గౌరవంగా కార్యకర్తల చేతికి చేరాల్సిన పత్రాలు ఇలా చెత్తకుప్పల మధ్య కనిపించడంపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది..!!

**..కార్యకర్తల కష్టానికి విలువ ఇంతేనా..??**
..ఎన్నికల సమయంలో పార్టీ కోసం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసిన కార్యకర్తలు..ఎండ,వానలను లెక్కచేయకుండా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసిన వారు..కష్ట కాలంలో పార్టీ జెండాను మోసిన వారు ఉన్నారు.అలాంటి కార్యకర్తలను గుర్తించి,ప్రోత్సహించాల్సిన సమయంలో వారి పేరుతో ముద్రించిన ప్రశంసా పత్రాలనే నిర్లక్ష్యంగా పడేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు..!!

**..ఘనంగా అందించాల్సిన**

**పత్రాలు..చెత్తకుప్పలోనా..??**
..జిల్లా వ్యాప్తంగా పార్టీ కోసం పనిచేసిన ఉత్తమ కార్యకర్తలను గుర్తించి,జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించి,ప్రశంసా పత్రాలు అందిస్తే వారికి మరింత ఉత్సాహం కలిగేదని కార్యకర్తలు పేర్కొంటున్నారు.కానీ పంపిణీ చేయాల్సిన పత్రాలు కార్యాలయం పక్కనే గుట్టలుగా దర్శనమివ్వడం పార్టీ కార్యకర్తల గౌరవాన్ని కించపరిచే చర్యగా అభివర్ణిస్తున్నారు..!!
..ఇంతమంది కార్యకర్తలకు ఇవ్వాల్సిన ప్రశంసా పత్రాలు ఎవరి పర్యవేక్షణలో ఉన్నాయి..?? వాటిని ఎందుకు పంపిణీ చేయలేదు..?? చివరకు చెత్తకుప్పల వద్దకు ఎలా చేరాయి..?? అనే అంశాలపై జిల్లా పార్టీ నాయకత్వం స్పష్టత ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు..!!
..కార్యకర్తలను గౌరవించాలనే అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునకు అనుగుణంగా ప్రశంసా పత్రాలను వెంటనే సంబంధిత కార్యకర్తలకు అందించి,వాటిని నిర్లక్ష్యంగా పడేసిన వ్యవహారంపై విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు..!!
..పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాల్సింది పోయి..వారి గుర్తింపు పత్రాలనే చెత్తకుప్పలో పడేయడం ఎంతవరకు సమంజసం..?? అని నంద్యాల నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు..??

# ఎన్టీఆర్ , జగన్ జీవితాలలో ఒకేసారి విషాదం నింపిన రోజు.. ఏంటో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:** సెప్టెంబర్ 2 అనగానే తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఒక తీరని విషాద జ్ఞాపకమే గుర్తొస్తుంది. రాజకీయ వర్గాల్లోనూ, సినీ వినోద ప్రపంచంలోనూ తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న ఇద్దరు ప్రముఖుల జీవితాల్లో తండ్రి లేని లోటును తీవ్రంగా గుర్తుచేసే రోజు ఇది. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరి జీవితాల్లోనూ తమ మార్గదర్శకులైన తండ్రుల జ్ఞాపకాలు ఈ ఒక్క రోజే ముడిపడి ఉండటం ఒక విచిత్రమైన, భావోద్వేగమైన కాంబినేషన్.

**వైఎస్ జగన్ జీవితంలో ముగియని ఆరాటం –సెప్టెంబర్ 2:**

2009 సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కన్నుమూశారు. ఇక తండ్రి వైఎస్సార్ వర్ధంతి కావడం వైఎస్ జగన్ జీవితంలో పూడ్చలేని లోటును మిగిల్చింది. ప్రతి సంవత్సరం ఈ రోజున జగన్ ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తూ, తండ్రి ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తానని భావోద్వేగంగా స్మరించుకుంటారు. జగన్ రాజకీయ ప్రస్థానానికి వైఎస్సార్ చూపిన బాటనే పునాది.

**జూనియర్ ఎన్టీఆర్ – తండ్రి జ్ఞాపకాలతో జయంతి సందడి:**

మరోవైపు నందమూరి హరికృష్ణ జయంతి కూడా సెప్టెంబర్ 2నే కావడం విశేషం. 1956 సెప్టెంబర్ 2న జన్మించిన హరికృష్ణ, 2018 ఆగస్టు 29న రోడ్డు



ప్రమాదంలో మరణించారు. ఇక తండ్రి మరణించినప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజున ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్‌లు తీవ్రమైన బాధతో తండ్రిని స్మరించుకుంటారు. "ఈ అస్తిత్వం మీరు.. ఈ వ్యక్తిత్వం మీరు" అంటూ ఎన్టీఆర్ షేర్ చేసే పోస్టులు నందమూరి అభిమానులను కంటతడి పెట్టిస్తుంటాయి.

**ఇద్దరి జీవితాల్లోనూ తండ్రుల పాత్ర అత్యంత కీలకం:**

జగన్ మరియు ఎన్టీఆర్ ఇద్దరి ఎదుగుదలలోనూ వారి తండ్రుల పాత్ర ఎంతో ఉంది. జగన్‌కు ప్రజాసేవ, ధైర్యం అనే లక్షణాలు వైఎస్సార్ నుంచి వస్తే, ఎన్టీఆర్‌కు మొక్కవోని ధైర్యం, క్రమశిక్షణ, నటనలో గంభీరత తండ్రి హరికృష్ణ నుంచే అబ్బాయి. ఇక సొంత కాళ్లపై నిలబడి ఇద్దరూ తమ రంగాల్లో అగ్రస్థానానికి చేరుకున్నప్పటికీ, తండ్రుల అడుగుజాడలే తమకు నిరంతర ప్రేరణ అని ఇద్దరూ బలంగా నమ్ముతారు.

**ఒకే రోజు చుట్టుముట్టే రెండు వేర్వేరు భావోద్వేగాలు:**

ఒకే తేదీ ఇద్దరు ప్రముఖుల కుటుంబాల్లో విభిన్నమైన, లోతైన జ్ఞాపకాలను గుర్తుచేస్తుంది. ఒకరికి తండ్రి వర్ధంతి కాగా, మరొకరికి తండ్రి జయంతి. రోజులు మారినా, సంవత్సరాలు గడిచినా సెప్టెంబర్ 2 రాగానే జగన్ మరియు ఎన్టీఆర్ ఇద్దరి మనసుల్లోనూ తమ తండ్రుల జ్ఞాపకాలు సుడులు తిరుగుతాయి. ఇక అభిమానులు కూడా సామాజిక మాధ్యమాల వేదికగా వైఎస్సార్, హరికృష్ణలకు ఘనంగా నివాళులు అర్పిస్తారు.తండ్రులు శారీరకంగా దూరమైనప్పటికీ, వారు నేర్పిన విలువల రూపంలో జగన్, ఎన్టీఆర్ జీవితాల్లో నిరంతరం జీవించే ఉంటారు. సెప్టెంబర్ 2 అనేది కేవలం ఒక తేదీ మాత్రమే కాదు, ఆ ఇద్దరి నమ్మకానికి, ధైర్యానికి పునాది వేసిన తండ్రులను నిష్ఠతో స్మరించుకునే ఒక భావోద్వేగ మైలురాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రోజుకు 18 గంటల డ్యూటీతో చంద్రన్న

**తిరుపతి సెప్టెంబర్ 2, పెన్ పవర్:**

దేశవ్యాప్తంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల పనితీరుపై ఢిల్లీ ఐఐఎం నిపుణులు అధ్యయనం చేశారు. దీనికి సంబంధించిన రిపోర్టును కొన్ని రోజుల్లోనే బహిర్గతం చేయనున్న ట్టు జాతీయ మీడియా వెల్లడించింది. దీనిలో ప్రధానంగా ఏపీ సీఎం చంద్రబాబు పనితీరుకు నిపుణులు ఎక్కువ మార్కులు వేయడం గమనార్హం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీహార్, ఏపీ, ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి పాలన సాగుతోంది.ఏ దేశానికైనా గొప్ప విజయం ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రుల పనితీరు విషయంపై అధ్యయనం చేసిన ఢిల్లీఐఐఎం.. ప్రజా సేవకు, పాలనకు వారు కేటాయిస్తున్న సమయం.. వారంలో ఎన్నిరోజులు పనిచేస్తున్నారు.. అనే విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. దీనిలో ఏపీ సీఎం చంద్రబాబు రోజులకు 12 గంటల పాటు పనిచేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. వాస్తవానికి చంద్రబాబు రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని.. ఆయనే స్వయంగా చెబుతున్నారు. అయితే.. ఐఐఎం ఢిల్లీ మాత్రం 12 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్నారని పేర్కొంది. ఇక, వారంలో ఆరు రోజుల పాటు సీఎం చంద్రబాబు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని.. పేర్కొంది. అలానే.. పాలన విషయంలో 24 గంటలూ స్పందిస్తున్నారని తెలిపింది. ఇక, మంత్రి వర్గంతో అత్యంత సఖ్యతగా ఉంటున్న సీఎంగా కూడా.. చంద్రబాబుకు తొలిస్థానం ఇచ్చింది. మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు ఆయన నివేదికలు తెప్పించుకుని సరిచేసుకుంటున్నారని పేర్కొంది. అవినీతి రహిత పాలన అందించేందుకు ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి బాగుందని కితాబివ్వడం గమనార్హం. కానీ, సీఎం సువేందు అధికారి కేవలం 6 గంటలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపింది. బీహార్ ముఖ్యమంత్రి కూడా 6 గంటలకే పరిమితం అవుతున్నారని.. వారానికి 5 రోజులు మాత్రమే పనిచేస్తున్నారని చెబుతోంది. కాగా.. ఈ రిపోర్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలోనే వెల్లడించనున్నారు. ప్రజాభిప్రాయాలు.. పాలన తీరు, తీసుకుంటున్న నిర్ణయాల ఆధారంగా ఈ నివేదికను రెడీ చేస్తున్నారని సమాచారం.

# ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు

**నెల్లూరు, సెప్టెంబర్ 2, పెన్ పవర్:** ఏపీలో ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు ముసురుకుంటున్నాయా? అన్న చర్చ జరుగుతోంది. ఉద్యోగుల డిమాండ్ల సాధనకంటూ ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, ఆయన తీరును నిరసిస్తూ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ జేఏసీ నేతలు వేర్వేరుగా మీడియాకు ఎక్కడం చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు రహస్య రాజకీయ అజెండా అమలు చేస్తున్నారని మిగిలిన ఉద్యోగ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కోరుకుంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను కించపరిచేలా బొప్పరాజు వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపడుతున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చాలా ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు వంటి ఆర్థికాంశాలుపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్లలో రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, 10 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చినా ఆర్థిక ప్రయోజనాలు అందజేయడంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంటూ ఉద్యోగ సంఘాల జేఏసీలు ప్లాన్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. అయితే ఆ సమావేశానికి హాజరైన వివిధ సంఘాల నేతలు, కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉద్యోగుల సమస్యలపై కాకుండా, రాజకీయ లక్ష్యాలతో మాట్లాడినట్లు కనిపిస్తోందని రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేయడం సంచలనం రేపుతోంది. ప్రధానంగా అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు లక్ష్యంగా భూపతిరాజు రవీంద్రరాజు చేసిన వ్యాఖ్యలు హీట్ పుట్టిస్తున్నాయి. బొప్పరాజు ఆధ్వర్యంలోని జరిగిన సదస్సులో కొందరు నాయకులతో బయట నుంచి వచ్చిన స్క్రిప్టు ప్రకారం మాట్లాడించేందుకు ప్రయత్నించారని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. సీఎం చంద్రబాబును విమర్శించడం, ఆయనపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా, సీఎం సతీమణి వ్యాఖ్యలను కూడా వ్యంగ్యంగా స్క్రీన్ పై ప్రదర్శించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని భూపతిరాజు రవీంద్రరాజు మండిపడుతున్నారు. ఇక బొప్పరాజు నిర్వహించిన సదస్సుకు సంబంధం లేకుండా ఉద్యోగుల సమస్యలపై తాము సొంతంగా నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు.సమస్యల పరిష్కారానికి ముందుగా మంత్రులతో చర్చిస్తామని, అనంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతామని విద్యాసాగర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో అమరావతి జేఏసీతో సంబంధం లేకుండా తాము పనిచేస్తామని ఏపీ జేఏసీ తేల్చిచెప్పినట్లైంది. మరోవైపు బొప్పరాజు ప్రకటించి ఉద్యమ కార్యాచరణతోపాటు ముఖ్యమంత్రిపై విమర్శలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఉద్యోగులు–ప్రభుత్వం మధ్య సఖ్యతను చెడగొట్టేలా బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి ఆరోపించారు. తాము ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ బకాయిలను తమకు అంటగడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ పరిణామాలతో అమరావతి జేఏసీ ప్రకటించిన మూడు దశల ఉద్యమ కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని ఆ సమావేశంలో బొప్పరాజు ప్రకటించినప్పటికీ, ఆయన సమక్షంలో కొందరు నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వంతో సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బొప్పరాజు ప్రకటించిన ఉద్యమంతో తమకు సంబంధం లేదని మిగతా సంఘాల నేతలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఏపీ జేఏసీ కూడా సొంతంగా పనిచేయాలని నిర్ణయించడంతో ఉద్యోగ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు స్పష్టమవుతున్నాయని అంటున్నారు.

# ఏకగ్రీవానికి నో అగ్రీ...

**విజయవాడ, సెప్టెంబర్ 2, పెన్ పవర్:** ఏకగ్రీవం వద్దు అని మరోసారి స్పష్టం చేశారు వైసీపీ చీఫ్ వైఎస్ జగన్. అది కూడా తన సొంత జిల్లా సొంత ప్రాంతం పులివెందుల వేదికగా ఆయన బిగ్గర స్వరం వినిపించారు. ఏకగ్రీవాలు అన్న మాటే వద్దు అని వైసీపీ లీడర్ ని క్యాడర్ ని ఆదేశించారు. ప్రతీ చోటా వైసీపీ పోటీ చేసి తీరాల్సిందే అని కూడా జగన్ గట్టిగానే దిశా నిర్దేశం చేశారు. దాంతో ఏపీలో ఏకగ్రీవాల విషయంలో బిగ్ వార్ కూటమి వర్సెస్ వైసీపీగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకే రోజున అటు ప్రభుత్వ అధినేత చంద్రబాబు ఏకగ్రీవాలు అన్నవి అవసరమని ఆహ్వానించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు సభలో బాబు ఏకగ్రీవాల మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దానికి ధీటుగా పులివెందుల నుంచి జగన్ పోటీ ఉండాల్సిందే అంటున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ నేతలు అంతా ఒక చాలెంజ్ గా తీసుకోవాలని జగన్ కోరారు. ఆయన పులివెందులలో పార్టీ నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అసలు ఎక్కడా ఏకగ్రీవం అన్నదే వద్దు, దానికి అసలు చాన్స్ ఇవ్వవద్దు అని చెప్పారు. ప్రతీ చోటా ప్రతీ సీటుకూ వైసీపీ పోటీ పడి తీరాల్సిందే అని కూడా జగన్ అన్నారు. ఇక అధికార పార్టీ నుంచి బెదిరింపులు వచ్చినా లేదా పోలీసులను ప్రయోగించినా దౌర్జన్యాలకు పాల్పడినా కూడా వైసీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని జగన్ కోరారు. భయపడకండి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది అని జగన్ భరోసా ఇచ్చారు. అంతే కాదు వైసీపీ హయాంలో జరిగిన మేలుని, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఏకగ్రీవాలు మేలు అని గ్రామ స్థాయిలో కక్షలు కార్పణ్యాలకు తావు లేకుండా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. ప్రభుత్వాలే వాటిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయని కూడా ఆయన వివరంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవాలు అన్నవి గతంలో జరిగినవే అన్న సంగతిని కూటమి నేతలు గుర్తుకు తెస్తున్నారు. ఇక అధికారంలో ఏ పార్టీ ఉంటే వీలుగా ఏకగ్రీవాలు చేసుకోవడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తోంది. అలాంటిది అసలు ఏకగ్రీవం అన్న మాటే వినిపించకూడదని జగన్ ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. అంటే పోటీకి వైసీపీ సై అంటోంది. అలాంటి పరిస్థితి ఉంటే కనుక అది గ్రామ స్థాయిలో కానీ పల్లెలలో కానీ ఒక రాజకీయ సమరానికే దారి తీస్తుందని అంటున్నారు. ఢీ అంటే ఢీ అంటూ రాజకీయం సాగి ప్రశాంత వాతావరణం వేడెక్కిపోతుంది అని అంటున్నారు.నిజంగా పోటీకి మరో పక్షం సిద్ధంగా ఉంటే అది ప్రజాస్వామిక విధానంగా చూడాలి. అలా కాకుండా పోటీని అనివార్యం చేయడం తగదన్న మాట వినిపిస్తోంది. అలాగే పోటీకి సిద్ధంగా ఎవరైనా ఉంటే ఏకగ్రీవం పేరుతో వారి గొంతు నొక్కే తీరు మంచిది కాదని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీ అంతటా ఒకేలా రాజకీయం ఉండదు, స్థానికంగా ఉండే పరిస్థితుల బట్టి అది మారుతూ ఉంటుంది. అందువల్ల ఏకగ్రీవాలు వద్దు అని వైసీపీ బిగ్ సౌండ్ చేసినా అలాగే కావాలని కూటమి కోరినా అది స్థానిక పరిస్థితులను విశేషంగా ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఎక్కడికక్కడ లోకల్ గా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిన ఎన్నికలను ప్రతిష్టగా మార్చాలనుకుంటే భీకర పోరుకు నాంది పలికినట్లు అవుతుందని అంటున్నారు.

# శ్రీవారి భక్తులను మోసగిస్తున్న 249 వెబ్ సైట్లు

**తిరుమల సెప్టెంబర్ 2, పెన్ పవర్:**

కిలీ వెబ్‌సైట్ల గురించి తిరుమల శ్రీవారి భక్తులను టీటీడీ మరోసారి అప్రమత్తం చేసింది. గదుల కేటాయింపు పేరుతో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ.. పోస్టర్లు, తప్పుడు హామీలతో భక్తులను మోసం చేస్తున్న 249 నకిలీ వెబ్‌సైట్‌లను ఈ సంవత్సరం ఇప్పటివరకు గుర్తించినట్లు టీటీడీ తెలిపింది. ఆ ఫేక్ వెబ్‌సైట్లను తొలగించామని.. రెండు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపింది. ఆన్‌లైన్‌లో టీటీడీ పేరుతో కనిపించే నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులను హెచ్చరించింది. శ్రీవారి దర్శనం, వసతి, సేవలు, టోకెన్ల విషయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని.. తిరుమలకు సంబంధించిన అన్ని సేవలు, నిబంధనలు, మార్గదర్శకాలపై అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.దర్శనం, గదుల కేటాయింపు అంటూ మోసాలకు పాల్పడుతున్న దళారులపై ఈ ఏడాది ఇప్పటివరకు 30 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 43 మంది టీటీడీ ఉద్యోగులపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. తిరుమలకు వచ్చే భక్తులు తమ సూచనలు, నిబంధనలు పాటిస్తూ.. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని సూచించింది.ఇక తిరుమలకు వచ్చే వెంకన్న భక్తులు తమ వెంట తీసుకువచ్చే వస్తువులపైనా టీటీడీ కీలక సూచనలు చేసింది. తిరుమలకు వచ్చే వాహనాల్లో నిషేధిత వస్తువులను తరలించకుండా అలిపిరి, శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టీటీడీ తెలిపింది. నిషేధిత వస్తువులను గుర్తిస్తే.. అలిపిరి టోల్‌గేట్ స్కానింగ్ కేంద్రం వద్దనే సీజ్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు అలిపిరి వద్ద 261 డ్రోన్లు, 105 మెటా స్మార్ట్ గ్లాసెస్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. తిరుమల క్షేత్రంలో భద్రత, గోప్యతను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి భక్తులు.. డ్రోన్లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి రికార్డింగ్ పరికరాలను తమ వెంట తీసుకురావద్దని విజ్ఞప్తి చేసింది.తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోందన్న టీటీడీ.. పరిమితికి మించి వస్తున్నప్పటికీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించింది. వైకుంఠ ఏకాదశి, రథసప్తమి, బ్రహ్మోత్సవాలు వంటి సమయాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. నిర్దేశిత సమయానికే భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా అన్ని విభాగాలు సమిష్టిగా, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం పేర్కొంది.

**భారీగా పెరిగిన లడ్డూల విక్రయం**

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. గత ఆరు నెలలుగా కొండపై భక్తుల రద్దీ పెరిగింది.. ముఖ్యంగా వీకెండ్, సెలవు రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువా కనిపిస్తోంది. టీటీడీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తుండటంతో స్వామివారి హుండీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. గత రెండు, మూడు నెలలుగా వెంకన్నకు కాసుల వర్షం కురిసింది. తాజాగా ఆగస్టు నెలలోనూ స్వామివారికి భారీగా ఆదాయం వచ్చింది.తిరుమల శ్రీవారిని ఆగస్టు నెలలో 24,56,017 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు వేంకటేశ్వరస్వామివారికి రూ.137.44 కోట్లు కానుకల రూపంలో సమర్పించారు. అలాగే1.30 కోట్ల లడ్డూలను విక్రయించారు. 10.50 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆగస్టు నెలలో ఏకంగా మూడుసార్లు హుండీ ఆదాయం రూ.5 కోట్లు దాటింది. ఆగస్టు 18న అత్యధికంగా 6.12 కోట్ల ఆదాయం సమకూరింది. ఆగస్టు 16న అత్యధికంగా 97,014 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. ఆగస్టు 15న అత్యధికంగా 53,090 మంది తలనీలాలు సమర్పించారు. ఆగస్టు 19 నుంచి 28 మధ్య రద్దీ తీవ్రంగా ఎక్కువగా ఉంది.. ఆ సమయంలో దర్శనానికి గరిష్ఠంగా 24 గంటల వరకు సమయం పట్టింది.మరోవైపు రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్.అవధాని ఆధ్వర్యంలో 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో యాగాలు, జపాలు,

పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఆరుగురు ఋత్వికులు కారీరిష్టి యాగం చేపడుతున్నారు. 12 మంది ఋత్వికులు గోగర్భం తీర్థంలో నడుము లోతు నీళ్లలో నిల్చుని వరుణ, పర్జన్య మంత్రాలను పఠించారు. అదేవిధంగా ఏడు వేద శాఖలకు చెందిన 14 మంది ఋత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.టీటీడీ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో సెప్టెంబరు 4న గోకులాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ జన్మదిన వేడుకలకు గోసంరక్షణశాల ఆధ్యాత్మిక వేదికగా నిలవనుంది. భక్తిభావాన్ని పెంపొందించేలా గోపూజతో పాటు వేదపఠనం, భజనలు, కోలాటాలు, సంకీర్తనలు, హరికథ తదితర కార్యక్రమాలను టీటీడీ నిర్వహించనుంది. గోకులాష్టమి రోజున ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారికి అభిషేకం, 6 గంటలకు వేణుగానం, 7.30 గంటలకు వేదపఠనం నిర్వహిస్తారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులచే భజనలు, కోలాటాలు, ఉదయం 8 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే శ్రీహరి సంకీర్తనలు ఆలపిస్తారు. ఉదయం 10 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి నిర్వహిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులకు స్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు. సాయంత్రం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని దివ్య లీలలు, గోసేవ మహత్యాన్ని వివరించే హరికథ నిర్వహించనున్నారు.

# వైసీపీ లోగుట్టు...దిద్దుకోకపోతే భారీ షాక్

**విజయవాడ, సెప్టెంబర్ 2, పెన్ పవర్:**

వైసీపీ పైకి పటిష్టంగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. కానీ సంస్థాగతంగా ఎన్నో లోపాలు సమస్యలు ఉన్నాయని అంటున్నారు. రాజకీయాల్లో జనాదరణ ఉండడం ఒక్కటే కొలమానం కాదు, ప్రజాకర్షణ అంటే జనాలను ఎక్కువగా తమ సభలకు రప్పించుకోవచ్చు.జేజేలు పలికించుకోవచ్చు. అయితే అవన్నీ ఓట్లు కావు. ఓట్లుగా మారాలంటే ఆ కథ వేరేగా ఉంటుంది. పొలిటికల్ గ్లామర్ వేరు పొలిటికల్ గ్రామర్ వేరు. గ్లామర్ లేకుండా గ్రామర్ ఉన్నా రాజకీయంగా రాణించవచ్చు. కానీ గ్లామర్ ఉండి గ్రామర్ లేకపోతే మాత్రం మనుగడ కష్టంగా మారుతుంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయిన పార్టీలు కూడా ఉన్నాయి. ఎంతో మంది సెలెబ్రిటీలకు తరగని జనాదరణ ఉంటుంది. కానీ వారు రాజకీయంగా పార్టీలు పెట్టి ఎందుకు ఫెయిల్యూర్ అవుతున్నారు అంటే పొలిటికల్ గ్రామర్ లేకపోవడమే అన్నది నిష్ఠుర సత్యం. ఇటీవల కాలంలో కొన్ని సర్వేలు వస్తున్నాయి. వైసీపీ గ్రాఫ్ పెరుగుతోంది అని అంటూ. అందులో అతిశయోక్తులు పక్కన పెడితే నిజాలు కూడా ఉన్నాయి. ఎలా అంటే అధికారంలో ఉన్న పార్టీకి యాంటీ ఇంకెంబెన్సీ అన్నది సహజం. మరి అది ప్రతిపక్షానికే టర్న్ అవుతుంది. అలా వైసీపీకి కూడా జరిగి ఉండొచ్చు. కానీ అలా గ్రావిటీ మాదిరిగా వస్తున్న ఈ యాంటీ ఇంకెంబెన్సీని ఒడిసి పట్టుకుని తమకు అనుకూలంగా చేసుకునే సామర్థ్యం సత్తా వైసీపీకి ఏ మేరకు ఉన్నాయన్నదే అసలైన ప్రశ్నగా ముందుకు వస్తోంది. వైసీపీ పెట్టి పదిహేనేళ్ళు అయింది కదా ఆ పార్టీ బలంగా ఉంది కదా అంటే అవన్నీ కరెక్టే కానీ ఈ రోజున ఎలా గ్రౌండ్ లెవెల్ లో



ఉంది అన్నదే ముఖ్యమని అంటున్నారు. కానీ ఆయన పేరుతో వచ్చే ప్రతీ ఓటుని జాగ్రత్తగా ఈవీఎంలలో వేయించుకునే స్తోమత కలిగిన పార్టీ యంత్రాంగం జిల్లాలలో నియోజకవర్గాల స్థాయిలో ఉందా అన్నదే పెద్ద చర్చ. వైసీపీ 2024లో ఓటమి పాలు అయ్యాక చాలా మంది పార్టీని వీడిపోయారు. దాని కంటే ముందు చూస్తే అనేక మంది సైలెంట్ అయ్యారు. ఇక వైసీపీ చేసిన రాజకీయ బదిలీలు షిఫ్టింగులు అన్నీ కూడా ఆ పార్టీకి అధిక శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో బలమైన ఇంచార్జిల లోటుని స్పష్టంగా చూపిస్తున్నాయని అంటున్నారు. ఒక ప్రముఖ సెఫాజలిస్టు తాజాగా వైసీపీ గ్రౌండ్ లెవెల్ పరిస్థితి గురించి మాట్లాడుతూ వైసీపీకి జనంలో ఆదరణ పెరిగినా అది ఓట్లుగా మార్చుకునేలా పార్టీ యంత్రాంగం ఉండాలని అన్నారు. నూటికి డెబ్బై శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసీపీకి వీక్ అయిన ఇంచార్జిలే ఉన్నారని అన్నారు. వీరంతా వైసీపీకి ఓటు బ్యాంక్ ని పెంచే వారు కారని కూడా చెప్పుకొచ్చారు.వ్ వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ బలమైన అభ్యర్ధులతో బరిలోకి దిగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎందుకంటే కూటమి బలంగా ముందుకు వస్తుందని దానిని ఢీ కొట్టాలంటే వైసీపీ ఇంచార్జిలు అన్ని విధాలుగా ఆరి తేరిన వారు అయి ఉండాలని అభిప్రాయపడ్డారు.. వైసీపీకి చెందిన 175 అసెంబ్లీ ఇంచార్జిలతో ఇటీవల అధినాయకత్వం కీలక సమావేశాన్ని నిర్వహించింది. అలాగే వారి పని తీరుని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని చెబుతోంది. మరి అన్నీ చేస్తున్న వైసీపీ పెద్దలకు ఈ వీక్ పాయింట్ ఏంటో స్పష్టంగా తెలియదా అన్నది ఒక చర్చ. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ వ్యవధి ఉంది కాబట్టి వైసీపీ సంస్థాగతంగా బలంగా ఉండేలా ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలకు దిగాలని హితైషులు సూచిస్తున్నారు. లేకపోతే భారీ షాక్ తగిలినా తగలవచ్చు అని అంటున్నారు.

# రోహిత్ అనుభవం, కోహ్లీ దూకుడు.. 2027 ప్రపంచకప్‌లో భారత జట్టుకు అవే బలం: జాంటీ రోడ్స్

- 2027 ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరమన్న రోడ్స్
- ప్రపంచకప్ లాంటి టోర్నీల్లో ప్రతిభ కన్నా మానసిక బలమే కీలకమని వ్యాఖ్య
- కోహ్లీ దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చిన దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం
- కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్ అని ప్రశంస
- కెప్టెన్‌గా ఉన్నా లేకున్నా, భారత్ గెలవాలనే కోహ్లీ తపన అమోఘమన్న రోడ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్.. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గెలిపించిన తిలక్ వర్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ 2026/27 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించి, టైటిల్ పోరుకు అర్హత సాధించేలా చేశాడు. సెప్టెంబర్ 6 నుంచి చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఫైనల్లో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. మ్యాచ్ చివరి రోజు 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్‌కు కెప్టెన్ తిలక్ వర్మ (79 బంతుల్లో 51 నాటౌట్) అండగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన సెంచరీ (116 నాటౌట్)తో జట్టును ఆదుకున్న తిలక్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 80 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారంభించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు. వరుస విరామాల్లో వికెట్లు తీసి నార్త్ జోన్ పతనాన్ని శాసించాడు. చివరి మూడు వికెట్లను పడగొట్టి, ఇన్నింగ్స్‌లో మొత్తం 5 వికెట్లు (5/56) సాధించాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 10వ ఐదు వికెట్ల ప్రదర్శన. దీంతో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 297 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో సౌత్ జోన్‌కు ఓపెనర్ రికీ భుయ్ (42) దూకుడైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, లంచ్ విరామానికి ముందు, ఆ తర్వాత నార్త్ జోన్ స్పిన్నర్ అబిద్ ముస్తాక్ విజృంభించడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. రికీ భుయ్‌ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయగా, షేక్ రషీద్, నారాయణ్ జగదీశన్ (43) వికెట్లను ముస్తాక్ పడగొట్టాడు. దీంతో సౌత్ జోన్ 102 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఒకింత కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ అయిన స్మరణ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ, అవసరమైనప్పుడు వేగం పెంచుతూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. గతేడాది ఫైనల్లో ఓటమిపాలైన సౌత్ జోన్, ఈసారి బలమైన ఆత్మవిశ్వాసంతో టైటిల్ పోరుకు సిద్ధమవుతోంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఓడించి ఈస్ట్ జోన్ ఫైనల్‌కు చేరుకుంది. విశేషమేమిటంటే.. 1970/71 సీజన్ తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడటం ఇదే తొలిసారి.


# చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి లక్ష్య సేన్ ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ తీవ్రంగా నిరాశ పర్చాడు. టోర్నీ తొలి రౌండ్‌లోనే కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో తేడాతో ఓటమి పాలై ఇంటిబాట పట్టాడు. బుధవారం (సెప్టెంబర్ 2) షెన్?జెన్ వేదికగా జరిగిన ఈ పోరులో ప్రపంచ ర్యాంకింగ్‌లో తొమ్మిదో స్థానంలో విక్టర్ కేవలం 38 నిమిషాల్లోనే 14-21, 7-21 తేడాతో భారత షట్లర్?ను మట్టికరిపించాడు. భారత షట్లర్ లక్ష్య సేన్ 4-0 ఆధిక్యంతో గేమ్?ను ఘనంగా ఆరంభించాడు. కానీ చివరి వరకు ఆ ఊపును నిలబెట్టుకోలేకపోయాడు. విక్టర్ లాయ్ బలంగా తిరిగి పుంజుకున్నాడు. వ్యూహాత్మక డిఫెన్స్?తో భారత ఆటగాడిని ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో లక్ష్యసేన్ ర్యాలీలను ఛేదించడానికి ఇబ్బంది పడుతూ మరింత ఎక్కువగా రిస్క్ తీసుకోవడం ప్రారంభించాడు. సేన్ పదేపదే బ్యాక్‌హ్యాండ్ సైడ్‌లైన్ వైపు షాట్లు మిస్ చేస్తుండటంతో ఒత్తిడి మరింత తీవ్రమైంది. లాయ్ ఆ పొరపాట్లను తనకు అనుకూలంగా మలుచుకుని తొలి గేమ్‌ను 21-14 తేడాతో గెలుపొందాడు. తొలి రౌండ్ కోల్పోయిన లక్ష్య సేన్?కు రెండో రౌండ్?లో తిరిగి కోలుకునే అవకాశమే లేకుండా పోయింది. బలమైన అటాకింగ్, డిఫెన్స్ గేమ్?తో విక్టర్ లాయ్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. 4-11తో వెనకబడ్డ లక్ష్యసేన్ పాయింట్ల అంతరాన్ని పూడ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మరిన్ని అనవసర తప్పిదాలు చేసి తగిన మూల్యం చెల్లించుకున్నాడు. కెనడియన్ ఆటగాడు రెండో గేమ్‌ను 21-7 తేడాతో కైవసం చేసుకున్నాడు. దీంతో తొలి రౌండ్ లోనే భారత ఆటగాడు టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

# 'ఎపిక్' సబ్కో సాంగ్.. విదేశాల్లో స్టూడెంట్ లైఫ్ ఇలా..

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి నాలుగో పాటగా 'సబ్కో' రిలీజ్ అయ్యింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. ఇప్పటివరకు వచ్చిన పాటల్లో ప్రేమకు ఎక్కువ చోటు కనిపిస్తే, ఈసారి ఫ్రెండ్స్ గ్యాంగ్ వైపు వెళ్లారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన స్టూడెంట్స్ అక్కడ ఎలా ఉంటారు, వాళ్ల రోజువారీ లైఫ్ ఎలా మారుతుంది అనే విషయాలను పాటలో చూపించారు. లండన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాట సాగుతుంది. లండన్ ఐ, డబుల్ డెక్కర్ బస్సులు, అక్కడి వీధులు, బీచ్ లొకేషన్స్ హైలెట్ అయ్యాయి. కానీ కేవలం లొకేషన్స్ చూపించడంతో ఆగలేదు. పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం, సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడం, రూమ్‌లో వంట చేసుకోవడం, అసైన్‌మెంట్స్‌తో కుర్చోవడం లాంటి స్టూడెంట్ లైఫ్ మూమెంట్స్ కూడా పెట్టారు. విదేశాల్లో చదివిన వాళ్లకు తెలిసిన చిన్న చిన్న విషయాలనే పాటలో ఎక్కువగా వాడారు. శ్రీ హర్ష ఇమాని రాసిన లిరిక్స్ కూడా అదే లైన్‌లో సాగుతాయి. "దేశం కాని దేశంలో" అంటూ ఇంటికి దూరంగా ఉన్న యువత పరిస్థితిని చెబుతూనే, కొత్త ఫ్రెండ్స్‌తో ఏర్పడే బంధాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఎదురయ్యే కష్టాలను మాత్రమే కాకుండా, వాటి మధ్యలో వచ్చే సరదాను కూడా పాటలో కలిపారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఈ పాటను పాడారు. ఆనంద్, వైష్ణవి మధ్య ట్రాక్ కూడా పాటలో పూర్తిగా పక్కన పెట్టలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి పబ్‌కు వెళ్లడం, బయట తిరగడం, ఒకరితో ఒకరు టైమ్ గడపడం కనిపిస్తుంది. బోర్డ్ గేమ్ ఆడే సీన్, చిన్న రొమాంటిక్ మూమెంట్స్ కూడా ఉన్నాయి. అంటే ఇది పూర్తిగా ఫ్రెండ్‌షిప్ సాంగ్ కాకుండా, వాళ్లిద్దరి రిలేషన్ కూడా అదే గ్రూప్ లైఫ్ మధ్యలో ఎలా పెరుగుతుందో చూపించేలా పెట్టారు.





'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే. కానీ ఈసారి వాళ్ల మధ్య కథ పూర్తిగా వేరే సెటప్‌లో ఉంది. ఆదిత్య హాసన్ '90ం ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' తర్వాత చేస్తున్న ఫీచర్ ఫిల్మ్ కావడంతో, మిడిల్ క్లాస్ యువత విదేశాలకు వెళ్లాక వచ్చే మరో జీవితాన్ని ఈ కథలో తీసుకున్నాడు. 'సబ్కో' పాటలో ఆ భాగం ఎక్కువగా బయటపడింది.

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు పది రోజుల ముందు ఈ పాటను తీసుకొచ్చారు. ప్రస్తుతం చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కాలేజీల్లో ప్రమోషన్స్ చేస్తోంది. 'సబ్కో'ను కూడా స్టూడెంట్స్ మధ్య విడుదల చేశారు. ఇక సినిమా కంటెంట్ లేటెస్ట్ జనరేషన్ కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965